సోమవారం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 36.4°C

కనిష్ఠం : 20.0°C

కారులో ఉద్యమ సెగ!



వరంగల్ సీటు కోసం గులాబీలో టఫ్ ఫైట్

- తనకే మళ్లీ చాన్స్ ఇవ్వాలంటున్న సిట్టింగ్ ఎంపీ
- తమకే ఇవ్వాలని ఉద్యమకారుల డిమాండ్
- కుమార్తె కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రయత్నాలు
- టికెట్ రాదనే కారు దిగుతున్న వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి

వరంగల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : 'గులాబీ' పార్టీలో టికెట్ల పంచాయతీ మొదలైంది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వరంగల్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నవారి నుంచి అధినాయకత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఓ వైపు సిట్టింగ్ ఎంపీకి ఈ సారి అవకాశం లేనట్టేనని భావిస్తున్న ఆశావహులు తమకు టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. మరోవైపు మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తెను ఎన్నికల బరిలో దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది గమనించే వరంగల్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తన దారి తాను చూసుకుని బీజేపీలో చేరుతున్నారన్న చర్చ జరుగుతోంది. ఇదంతా ఒక ఎత్తయితే.. తమకూ ఒక చాన్స్ ఇవ్వాలంటూ తెలంగాణ ఉద్యమకారులు కొత్త డిమాండ్‌ను తెరపైకి తేవడం బీఆర్ఎస్‌కు కొత్త చిక్కులు పెట్టింది. ఇప్పటికే చేజారిపోతున్న లీడర్లు, క్యాడర్‌ను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నా అవి ఫలించకపోవడం అధిష్ఠానానికి తలనొప్పిగా మారగా.. కొత్తగా ఉద్యమ సెగ బయటకు రావడంతో వరంగల్ ఎంపీ టికెట్ ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది. ఇక పార్టీ మారుతున్నారన్న విస్తృతంగా ప్రచారం జరిగిన మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకే అనుహ్యంగా మహబూబాబాద్ టికెట్ కేటాయిస్తున్నట్లుగా ప్రకటన చేయటం రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

పదేళ్లుగా బీఆర్ఎస్‌కు కంచుకోటలు..

2009లో నియోజకవర్గాల పునర్విభజనలో.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ (ఎస్సీ రిజర్వుడు), మహబూబాబాద్ (ఎస్టీ రిజర్వుడు) స్థానాలు ఏర్పడ్డాయి. తొలిసారిగా 2009లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సిరిసిల్ల రాజయ్య, మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్ విజయం సాధించారు. అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో బలరాంనాయక్ కేంద్ర మంత్రిగా కూడా పని చేశారు. ఆ తరువాత 2014 జరిగిన ఎన్నికల్లో వరంగల్ ఎంపీ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కడియం శ్రీహరి, మహబూబాబాద్ ఎంపీగా పోటీ చేసిన ప్రొఫెసర్ సీతారాంనాయక్‌లు విజయం సాధించారు. 2016లో జరిగిన ఉప ఎన్నికల్లో, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ నుంచి పసునూరి దయాకర్ విజయం సాధించారు. 2019లో మహబూబాబాద్ నుంచి ఎంపీగా మాలోతు కవిత విజయం సాధించారు. ఈ నేపథ్యంలో పదేళ్లుగా బీఆర్ఎస్‌కు వరంగల్, మహబూబాబాద్ స్థానాలు కంచు కోటలుగా ఉన్నాయి. కానీ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో కేడర్‌లో జోష్ తగ్గింది. అంతేకాకుండా కీలక నేతలు పార్టీని వీడటం, కొందరు పార్టీతో అంటీముట్టనట్టుగా ఉంటుండటం కొంత ఇబ్బందికరమే అయినా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న బీఆర్ఎస్ అధినాయకత్వం తమకు కంచుకోటగా ఉన్న ఈ రెండు స్థానాల్లో ఎలాగైనా సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతోంది.

వరంగల్ బరిలో కడియం కావ్య?



కడియం కావ్య

వరంగల్ పార్లమెంట్ ఎంపీ స్థానానికి బీఆర్ఎస్‌లో భారీ డిమాండ్ ఉంది. టికెట్ ఇస్తే పోటీ చేసేందుకు ఆరడజను మందికి పైగా సిద్ధంగా ఉన్నారు. 2016 నుంచి రెండు పర్యాయాలు గెలిచిన సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ మరోసారి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో రెండు పర్యాయాలు దయాకర్ సులభంగా ఎంపీగా గెలిచారని, ప్రస్తుతం అధికార కాంగ్రెస్‌తో పాటు మోదీ హవాతో జోష్‌లో ఉన్న బీజేపీని తట్టుకో వటం అంతా సులవు కాదని గులాబీ నేతలు లెక్కలు వేస్తున్నారు. దీంతో మాజీ డిప్యూటి సీఎం, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తె డాక్టర్ కడియం కావ్యను పార్లమెంట్ బరిలో దించాలనే ఆలోచనలో ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం స్టేషన్‌ఘనపూర్ ఒక్కటే బీఆర్ఎస్ ఖాతాలో పడింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి కడియం కావ్యను బరిలో దించాలని

మిగతా 4వ పేజీలో..

మళ్లీ కవితకే...

బీఆర్ఎస్ మహబూబాబాద్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ

మహబూబాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిత్వం.. సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకే ఖరారైంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సోమవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఈ ప్రకటన చేశారు. మానుకోట నుంచి ఎంపీ అభ్యర్థిగా మాలోతు కవిత పోటీచేస్తున్నారని వెల్లడించారు. ఆమె విజయం కోసం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ, ఇన్‌చార్జ్‌లు, ముఖ్యనాయకులు అంతా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సంబంధిత నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సూచించిన కేసీఆర్ సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఇక ఈ సమావేశానికి మహబూబాబాద్ ఎంపీ నియోజకవర్గం పరిధిలోని భద్రాచలం నుంచి గెలిచిన ఏకైక బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ గైర్హాజరయ్యారు. నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు, పినపాక మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, డీఎస్ రెడ్యానాయక్, బానోత్ హరిప్రియనాయక్, రేగ కాంతారావుతో పాటు ములుగు నుంచి పోటీ చేసి ఓడిన జడ్పీ చైర్‌పర్సన్ బడె నాగజ్యోతి, మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ హాజరయ్యారు. తొలుత ఈస మావేశానికి హాజరైన మానుకోట జిల్లాకు చెందిన మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ఎమ్మెల్యే హరీష్‌రావుతో మాట్లాడి.. తనకు వ్యక్తిగత పనిఉందని చెప్పి సమావేశం నుంచి వెళ్లిపోయినట్టు తెలిసింది.



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసిన కవిత, మహబూబాబాద్ బీఆర్ఎస్ నాయకులు

పోటీకి ఉద్యమకారుల సై..



మాట్లాడుతున్న జోరిక రమేశ్

తమకు ఈసారి అవకాశమివ్వాలని, వరంగల్ టికెట్ కేటాయించాలన్న డిమాండ్‌ను ఉద్యమకారులు తెరపైకి తెచ్చారు. పార్టీలో సభ్యత్వం కూడా లేని వ్యక్తులకు వరంగల్ ఎంపీ టికెట్ ఎలా ఇస్తారని తెలంగాణ ఉద్యమకారులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ ఇప్పటికే హరీ‌ష్‌రావు, వినోద్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ కీలక నేతలను కలిసి తనకు టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణివరంగల్ రూరల్ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న కూడా వరంగల్ ఎంపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే నగరానికి చెందిన మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా సైతం ఎంపి టికెట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను కేసీఆర్ గుర్తించాలని డిన్నా కోరుతున్నారు. తెలంగాణ ఉద్యమకారులు బొళ్లికొండ వీరేందర్, భైరి నిరంజన్, చింతల యాదగిరితో పాటు మరికొంత మంది కీలక నేతలు కూడా వరంగల్ టికెట్ కోసం క్యూ కడుతున్నారు. ఉద్యమకారుల్లో ఎవరికి టికెట్ ఇచ్చిన ఓకే.. కానీ, పార్టీలో సభ్యత్వం కూడా లేని వారికి టికెట్ ఇస్తే ఊరుకునేది లేదని ప్రెస్‌మీట్ పెట్టి మరీ వారు అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. అయితే ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఉన్న వారిని గుర్తించేందుకు పార్టీ అంతర్గతంగా సర్వే నిర్వహిస్తోంది. దళితుల్లో మాల, మాదిగ కులాల్లో ఎవరికి టికెట్ ఇస్తే గెలుపు అవకాశాలు ఉంటాయో అనే లెక్కలను కూడా అధిష్ఠానం తీస్తున్నట్టు సమాచారం. దీంతో వరంగల్ ఎంపి టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ గులాబీ పార్టీలో నెలకొంది.

విషాదం




తెగి కింద పడిన విద్యుత్ వైర్

విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి

- మరో ఇద్దరికిగాయాలు, బాలుడి పరిస్థితి విషమం
- ఓవర్‌లోడ్‌తో మంటలు చెలరేగి, తెగి పడిన కరెంట్ వైరు
- పర్వతగిరి మండలం మోత్యాతండాలో దుర్గమ్మ పండుగకు ఏర్పాట్లు
- ఊహించని ఘటనతో గ్రామంలో హాహాకారాలు



దేవేందర్(ఫైల్)



సునీల్ (ఫైల్)



భూక్యా రవి(ఫైల్)

పర్వతగిరి, మార్చి 4 : ఊరంతా పండుగ సందడి. చుట్టాలతో ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి. విద్యుద్దీపాల వెలుగులతో, మైకుల మోతల మధ్య అంతా ఉత్సాహం గా ఉన్న వేళ.. ఒక్కసారిగా అలజడి. ఒక్కసారిగా విద్యు త్ స్తంభంపై మంటలు.. ఆ వెంటనే తెగిపడిన వైరు.. అక్కడే ఉన్న ఐదుగురిపై పడింది. గ్రామమంతా అంధకారం.. హాహాకారాలతో మారుమోగింది. తామంతా దుర్గ మ్మ పండుగకు సిద్ధమైన వేళ.. ఈ ఊహించని ఘటన తో వారంతా ఖిన్నులయ్యారు. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరోఇద్దరు గాయపడ్డారు. ఈ విషాద సంఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మోత్యా తండాలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మోత్యా తండాలో మంగళవారం దుర్గమ్మ పం డుగను నిర్వహించుకునేందుకు ఘనంగా ఏర్పాట్లు చేసుకున్నారు. బంధుమిత్రులను ఆహ్వానించుకున్నారు. ఈ క్రమంలో వాకిళ్లలో అధిక వెలుతురు కోసమని ఇంటిం టికి ఒక డూమ్ లైట్‌ను అమర్చుకున్నారు. అయితే 100కుపైగా ఇళ్లున్న ఈ తండాకు సింగిల్‌ఫేస్ కరెంట్ మాత్రమే సరఫరా అవు తుండటంతో.. ఎక్కువ విద్యుత్ వినియోగమయ్యే డూమ్‌లైట్లను పెట్టడంతో ఓవర్‌లోడ్ పడింది. దీంతో ఓ స్తంభానికి ఉన్న విద్యుత్ వైర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి ఆ వైర్ తెగిపడింది. ఆ వైర్ పడిన ప్రాంతంలో నిలుచుని ఉన్న మోత్యాతండాకు చెందిన భూక్యా రవి(30), ఆరేళ్ల వయసున్న అతడి కుమారుడు జశ్వంత్, రాయపర్తి మండలంలోని జగన్నా థపల్లి కొత్త తండాకు చెందిన రవి బావ గుగులోత్ దేవేందర్(32), మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండ లంలోని జమస్తాన్‌పురం సుందర్‌నాయక్ తండా నుంచి టెంట్లు వేసేందుకు వచ్చిన బానోత్ సునీల్(20), మోత్యా తండాకు చెందిన భూక్యా ఈర్యాలపై పడింది. దీంతో దేవేందర్ అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన రవి, జశ్వంత్, సునీల్, ఈర్యాను ఆస్పత్రికి తరలిస్తుండ గా రవి, సునీల్ మార్గంమధ్యలో మృతిచెం దారు. జశ్వంత్ ఎంజీఎంలో చికిత్స పొందుతుండగా అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఈర్యా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు.

ఆనందం ఆవిరి..

ఆనందంగా పండుగజరుపుకునే సమయంలో విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతిచెందడంతో తండావాసుల ఆనందం ఆవిరైంది. తండావాసులు, బంధుమిత్రులంతా శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాల వద్ద బంధువులు పడి రోదించడం కలచివేసింది. ఇక ఈ ఘటనతో తండావాసులు పండుగను వాయిదా వేసుకోగా.. బంధువులంతా తిరుగుపయనమయ్యారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తండాకు చేరుకుని బాధిత కుటుంబాల వారిని పరామర్శించారు.

విచారణ జరిపిస్తాం: చంద్రమౌళి, ఏడీఈ

తండాలో ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్ వేర్లు తెగిపడ్డాయని మాకు సమాచారం వచ్చింది. మా శాఖ తరపున పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం. వైర్లు తెగిపడి ముగ్గురు మృతిచెందడం బాధాకరం. విచారణ జరిపిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.



మృతుల కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పరామర్శించిన ఎమ్మెల్యే

విద్యుత్‌ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన విషయం తెలియగానే వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతులకు నివాళులర్పించి బంధువులతో మాట్లాడారు. మృతు ల కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంజీఎంలో కూడా చిన్నారి జశ్వంత్‌ను పరామర్శించారు. కార్య క్రమంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల్ని సకాలంలో పరిష్కరించాలి'

వరంగల్ కలెక్టరేట్, మార్చి 4: ప్రజావాణిలో ప్రజలు అందించిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 148 దరఖాస్తులను అందజేశారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలంటే అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హతను బట్టి వారికి మంజూరి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ సీఎం పేషీ ప్రజావాణిలో జిల్లాకు చెందిన ఆర్జీలు సంబంధిత శాఖల అధికారులకు ఆన్‌లైన్ పంపించడం జరిగిందని, వాటిని పరిశీలించి పరిష్కరించి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 148 దరఖాస్తులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు సం బం. దించి 114, గ్రేటర్ మునిసిపాలిటీ 4, ఈసీఎస్‌వో 2, డీపీవో 3, డీఆర్‌డీఏ 2, డీఎం అండ్ హెచ్‌వో 4, ఉపాధి శాఖ 2, లీడ్ బ్యాంకు 2, డీడబ్ల్యూవో 3, పొల్యూషన్ 1, మార్కెటింగ్ శాఖ 1, హ్యాండ్లూం 2, సర్వే ల్యాండ్ 2, ఎస్సీ కార్పొరేషన్ 1, పశుసంవర్ధక శాఖ 2, కుడా 1, విద్యాశాఖ 3 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో నర్సంపేట ఆర్‌డీవో కృష్ణ వేణి, డీఆర్‌డీవో పీడీ కౌసల్యాదేవి పాల్గొన్నారు.

ఇద్దరు ఏసీపీల బదిలీ

హనుమకొండ క్రైం, మార్చి 4 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వరంగల్ పీటీసీలో ఉన్న వడ్డె ప్రసన్నకుమార్‌ను హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు, అదేవిధంగా ప్రస్తుతం అండర్ సస్పెన్షన్‌లో ఉన్న ఎ.యాదగిరిని వరంగల్ సీసీఎస్‌కు బదిలీ చేశారు.

నర్సంపేట మునిసిపల్ బడ్జెట్ రూ.53.75కోట్లు



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్, కమిషనర్, చైర్‌పర్సన్

నర్సంపేట టౌన్, మార్చి 4 : నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయంలో 2024-25 గాను ఆదాయం రూ. 53 కోట్ల 75 లక్షల 2వేలు, వ్యయం రూ .53 కోట్ల 73 లక్షల 14 వేలు కాగా, మిగులు రూ.2లక్షల అంచనాతో బడ్జెట్‌ను సమావేశంలో సభ్యులు సోమవారం ఆమోదం తెలిపారు. చైర్‌పర్సన్ గుంటి రజని అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. మునిసిపాలిటీకి పన్నుల రూపేణా రూ. 6.85కోట్లు వస్తుండగా, జీతాలకు రూ.459.32 లక్షలు కేటాయించారు. మునిసిపాలిటీ కాంప్లెక్స్ ద్వారా వచ్చే ఆదాయం రూ 132.85 లక్షలు కాగా, శానిటేషన్ విభాగానికి ఖర్చుల కోసం రూ 125.55లక్షలు కేటాయించారు. శానిటేషన్ ద్వారా వచ్చే ఆదాయం రూ 35.75లక్షలు కాగా, కరెంట్ చార్జీల చెల్లింపుల కోసం రూ.86 లక్షలను కేటాయించారు. పట్టణ ప్రణాళిక ద్వారా వచ్చే ఆదాయం రూ.121.10 లక్షలు కాగా, లోన్ రీ పేమెంట్ కోసం రూ. 3లక్షలను కేటాయించారు. ఇంజనీరింగ్ విభాగం ద్వారా వచ్చే ఆదాయం రూ.152. 81 లక్షలు కాగా, గ్రీన్ బడ్జెట్ ఖర్చు కోసం రూ.112.43 లక్షలు కేటాయించారు. నాన్‌ప్లాంట్ గ్రాంట్ ద్వారా రూ.350లక్షలు కాగా, 1/3 మిగులు బడ్జెట్ ఖర్చు కోసం రూ.49.44లక్షలు కేటాయించారు. ప్లాన్ గ్రాంట్ ద్వారా వచ్చే ఆదాయం రూ.20 లక్షలు కాగా ఇంజనీరింగ్ విభాగం ఖర్చుల కోసం రూ.118. 50లక్షలు కేటాయించారు. ఇతర గ్రాంట్ ద్వారా వచ్చే ఆదాయం రూ.3810.7లక్షలు కాగా, అడ్మినిస్ట్రేషన్ ఖర్చు కోసం రూ 69. 20 లక్షలు కేటాయించారు. డిపాజిట్ ద్వారా వచ్చే ఆదాయం రూ.70లక్షలు కాగా, పట్టణ ప్రణాళిక విభాగం కోసం రూ.2లక్షలను కేటాయించారు. అలాగే వార్డుల వారిగా ఖర్చుల కోసం రూ.60లక్షలు, నాన్ ప్లాన్ గ్రాంట్ ఖర్చుల కోసం రూ.350 లక్షలు, నాన్ గ్రాంట్ ఖర్చుల కోసం రూ.20లక్షలు డిపాజిట్‌ల వ్యయం కోసం బడ్జెట్‌ను రూపొందించగా సభ్యులు అమోదించారు.

వేసవిలో నీటి ఎద్దడి తీర్చాలి..

రాబోయే వేసవిలో పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా నీటి సంబంధిత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో 2024-25 సంవత్సర బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ గుంటి రజని అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ రోజు పట్టణ వాసులకు తాగునీటి సరఫరా చేయాలని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమావేశంలో మునిసిపల్ కమిషనర్ వి.శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

14మంది కౌన్సిలర్లు గైర్హాజరు

నర్సంపేట మునిసిపల్ బడ్జెట్ సమావేశానికి 14 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. 24 మంది కౌన్సిలర్లలో ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. బీఆర్ఎస్‌కు చెందిన 9 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నుంచి ఇటీవల బీజేపీలోకి వెళ్లిన ఐదుగురు కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాలేదు.

కారులో ఉద్యమ సెగ!

(3వ పేజీ తరువాయి)

శ్రీహరి భావించారు. అయితే అధిష్ఠానం శ్రీహరికే టికెట్ ఇవ్వ టంతో అప్పట్లో కావ్య రాజకీయ రంగ ప్రవేశానికి అవకాశం దక్కలేదు. దీంతో కడియం శ్రీహరి తన కుమార్తె రాజకీయ ప్రవేశానికి ఇదే మంచి అవకాశంగా భావిస్తున్నట్టు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో వరంగల్ టికెట్ కావ్యకు కేటాయించాలని అధి ష్ఠానం వద్ద కడియం శ్రీహరి గట్టిగానే ఒత్తిడి తెస్తున్నారనే చర్చ జరుగుతోంది. దీంతో గత ఎన్నికల్లో వర్ధన్న పేట ఎమ్మెల్యేగా ఓటమిపాలైన మాజీ ఎమ్మెల్యే అ రూరి రమేష్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి ఉత్సాహంగా ఉన్నప్పటికి అధిష్ఠానం నుంచి ఎలాంటి హామీ రాకపోవటంతో తన భవిష్యత్ నిర్ణయం తీసుకునే క్రమంలో ఆయన బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఒకటిరెండు రోజుల్లో బీజేపీలో చేరేందుకు ఆరూరి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. దీంతో తన వారసురాలి పోటీకి లైన్ క్లియర్ అయిందని కడియం భావిస్తుండగా.. ఈ క్రమంలోనే ఉద్యమ నేతల నుంచి టికెట్ డిమాండ్ మొదలవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చిందన్న చర్చ జరుగుతోంది.

చర్చనీయాంశమైన మానుకోట అభ్యర్థి ప్రకటన

మానుకోట స్థానాన్ని బీఆర్ఎస్ అధినాయకత్వం సిట్టింగ్‌కే ఖరారు చేసింది. దీంతో ఎంపీ మాలోతు కవిత మరోసారి బీఆర్ఎస్ తరఫున పార్లమెంట్ బరిలో నిలవనున్నారు. ఆమె బీజేపీలోకి వెళుతున్నారనే ప్రచారం జోరుగా సాగిన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల సమావేశంలో మానుకోట అభ్యర్థిగా కవిత పేరును ప్రకటించడం చర్చనీయాంశమైంది. పార్టీ మారుతోందని ప్రచారం జరిగిన కవితకే మళ్లీ టికెట్ ఇవ్వటం వెనుక గులాబీ బాస్ వ్యూహం ఏంటనే చర్చ జరుగుతుంది. కవిత స్థానంలో వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ కుమారుడుకి టికెట్ ఇస్తారనే ప్రచారం జరగ్గా.. అనుహ్యంగా కవితకే టికెట్ రావటంతో పార్టీవర్గాల్లోనూ చర్చకు దారితీసింది. అయితే తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ సీతారాం నాయక్ తనకే టికెట్ ఇవ్వాలని, తెలంగాణ ఉద్యమంలో తన పాత్రను గుర్తించాలని అధిష్ఠానం వద్ద విజ్ఞప్తులు చేస్తున్నారు. అయితే సీతారాంనాయక్ విజ్ఞప్తులకు గుర్తింపు లేకపోగా, బీజేపీ నుంచి పోటీకి ఆఫర్లు వస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో సీతారాంనాయక్ ఏం నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ కనిపిస్తోంది.

సీపీని కలిసిన రఘునాథ్‌పల్లి ఎస్ఐ

హనుమకొండ క్రైం, మార్చి 4 : ఇటీవల జరిగిన బదిలీలలో రఘునాథ్‌పల్లి ఎస్ఐగా పోస్టింగ్ పొందిన డి. నరేష్ సోమవారం విధుల్లో చేరారు. కాగా, నూతనంగా బాధ్యతలు చేపట్టిన నరేష్ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిశాడు. సీపీని కలిసి పూల మొక్కను అందించారు.

అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్

» అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అర్చక, ఉద్యోగులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం చేసింది. బోర్డు చైర్మన్ నవీన్ మిట్టల్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, విశ్రాంత హైకోర్టు జడ్జి వామన్‌రావు ఇతర అధికారులు సచివాలయంలో సోమవారం సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలు ఈ సమావేశంలో కొలిక్కి వచ్చాయి. ప్రధానంగా, దేవాదాయశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దులో వేతనాలు పొందుతున్న అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని తీర్మానం చేశారు. అయితే, ఒకేసారి అందరికి కాకుండా దశల వారిగా అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. మొదటి విడతలో రూ.50 వేలలోపు వేతనం ఉన్నవారికి, అనంతరం పలు దఫాల్లో మిగతా వారికి హెల్త్ ఇన్సురెన్స్ కల్పించనున్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల నుంచి అర్చక, ఉద్యోగుల సమాచార సేకరణ ప్రక్రియ తక్షణం ప్రారంభించాలని దేవాదాయశాఖ అధికారుల్ని కోరారు.

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు: కిషన్ రెడ్డి

ఆదిలాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి అసలు భవిష్యత్తే లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ అంటేనే ఆదివాసీల గడ్డాగా పేరుందని, ఈ ప్రాంతంలో కొమురంభీం, రాంజీ గోండు స్ఫూర్తిగా ఎన్నో పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆశీస్సులతో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు కూడా భవిష్యత్ లేదని ఆయన అన్నారు.

గతేడాది యాసంగి సీఎంఆర్ గడువు పెంపు

» మే 15 తేదీ వరకు అవకాశం కల్పించిన కేంద్రం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గతేడాది(2022- 23) యాసంగి సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ గడువును రానున్న మే నెల 15 తేదీ వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సీఎంఆర్ గడువు పెంచాలని గత ఫిబ్రవరి నెల 23 తేదీన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను పరిగణనలోకి తీసుకొని ఈ ఉత్తర్వులు ఇచ్చింది. బియ్యం రీసైక్లింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, మిల్లుల వారీగా లిఖితపూర్వకంగా షెడ్యూలు తీసుకొని, ఎఫ్‌సీఐకి డెలివరీ చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎఫ్‌సీఐ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, డెలివరీ సమయంలో బియ్యాన్ని పరీక్షించి తీసుకోవాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్.. వివిధ జిల్లాల మేనేజర్లు, డీఎస్‌వోలకు సోమవారం సర్క్యులర్ జారీచేశారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యంలో ఇటీవల టెండర్లు పిలిచిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మినహాయించి.. మిల్లింగ్ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

5-6 నెలల తర్వాత..

ఈ సర్కారుండదు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ నేతలతో పలు అంశాలపై చర్చించారు. సిటింగ్ ఎంపీలు నామా నాగేశ్వరరావుకు ఖమ్మం, మహబూబాబాద్‌లో మాలోతు కవితకు మరోసారి పోటీకి అవకాశం ఇవ్వాలని ఈ భేటీలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జులుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డిని నిర్ణయించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, వారిపై ఉండే వ్యతిరేకతను బీఆర్ఎస్‌కు అనుకూలంగా మార్చుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేద్దామని పార్టీ శ్రేణులతో అన్నారు. బీఆర్ఎస్‌ను వీడుతున్న వారివల్ల పార్టీకి ఎటువంటి నష్టం ఉండబోదని.. అలాంటి పరిణామాలను చూసి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. 12న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించిన అనంతరం.. ఖమ్మంలోనూ బహిరంగ సభ చేపడతామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ ఓడిపోయినా.. అధైర్యపడాల్సిన పనిలేదని, నాయకులు ధైర్యంతో ముందడుగు వేయాలని సలహా ఇచ్చారు. పార్టీని పటిష్ఠం చేసుకోవడంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ ముగ్గురితో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. "బీఆర్ఎస్ పాలనలో సాగునీరు, తాగునీరు, విద్యుత్‌ను సమృద్ధిగా అందించడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో ప్రజలకు చేయాల్సింది చేశాం. అయినప్పటికీ.. వారు మనకు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారు. మన విలువ ప్రజలకు తొందరలోనే తెలుస్తుంది" అన్నారు. రాష్ట్రంలో రైతు బంధు, దళితబంధు వంటి పథకాలు



తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్

ఎన్నికల కోసం తేలేదని, ఒక విజన్‌తో తెచ్చానని కేసీఆర్ చెప్పారు.

ఎన్టీఆర్‌లాంటి నేతకే తప్పలేదు..

"రాజకీయాల్లో గెలుపోటములు సహజమే. ఎన్టీఆర్ లాంటి నేతకే ఒడుదొడుకులు తప్పలేదు.. ఆయన ముందు మనమెంత?" అని కేసీఆర్ ఈ భేటీలో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో పాతాళానికి పడిపోయి కూడా మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని పేర్కొన్నారు. "అప్పట్లో టీడీపీ మన పార్టీ కంటే దారుణంగా ఓటమి చవిచూసింది. అయినప్పటికీ.. తప్పులను సరిదిద్దుకొని తిరిగి చేజిక్కించుకుంది" అని పార్టీ శ్రేణులకు గుర్తుచేశారు. "అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఓడిపోవడం కూడా మంచిదే.. గుర్రం ఏదో.. గాడిదేదో తెలుసుకునే అవకాశం రాష్ట్ర ప్రజలకు వచ్చింద"ని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాగా.. ఈ సమీక్షా సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరు కాలేదు. వెంకటరావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం లాంఛనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నలుగురు అభ్యర్థుల పేర్లు ఖరారు

రెండు రోజుల సమీక్షల అనంతరం కేసీఆర్ తమ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే నలుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత పోటీ చేస్తారని ఆయన వెల్లడించారు.

కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజలకు చెప్పండి: హరీశ్

అధికారంలోకి వచ్చి 3 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని.. అసంపూర్తిగా అమలుచేసిన రెండు, మూడు హామీల చూపించి అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకుంటోందని.. రాష్ట్రంలో ఆ పార్టీ అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి చెప్పాలని పార్టీ నేతలతో మాజీ మంత్రి టి.హరీశ్ రావు పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నేతలతో కేసీఆర్ సమీక్ష అనంతరం తెలంగాణ భవన్‌లో ఆ రెండు నియోజకవర్గాల అభ్యర్థులు, ముఖ్యనేతలతో హరీశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలపై ఎక్కడికక్కడ నిలదీయాలని, ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని సూచించారు. గల్లీలో కాంగ్రెస్ ఉన్నా, తెలంగాణ సమస్యలు ఢిల్లీ వేదికగా ప్రశ్నించేందుకు, పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలవాలన్నారు. కాగా.. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీనే కాక ఎవరు పోటీ చేసినా ఎదుర్కొంటామని.. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారన్నారు.



సిరిసిల్ల జిల్లా నారాయణపూర్‌లో జరిగే రేణుకామాత జమదగ్ని కల్యాణానికి రావాల్సిందిగా కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న గౌడ సంఘం నేతలు

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పోరుబాట

» 6న నియోజకవర్గాల కేంద్రాల్లో ధర్నాలు

» 7న కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతిపత్రాలు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పోరు బాటకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అనుమతులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను తమపార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాలవద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ బాధితులను కలుపుకొని ఈ ధర్నాలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా 33 జిల్లాల పరిధిలో ఈనెల 7న జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించాలని చెబితే రక్తమాంసాలు పీలుస్తున్నామని నాడు విమర్శించారన్నారు. గతంలో తాము ఎల్ఆర్ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోర్టుకు వెళ్లారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను రద్దుచేస్తామని గతంలో భట్టివిక్రమార్క చెప్పారని, నో ఎల్ఆర్ఎస్.. నో టీఆర్ఎస్ అని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. అదేవిధంగా ఉచితంగా భూములను క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారని, జనం సొమ్ము దోచుకోవడానికి ఎల్ఆర్ఎస్ తెచ్చారని సీతక్కకూడా అన్నారని పేర్కొన్నారు. ప్రజలపై ఆర్థికభారం మోపడానికి రంగం సిద్ధం చేశారని, రాష్ట్ర ప్రజల ద్వారా రూ.20వేల కోట్లు రాబట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

ఉమ్మడి పాలమూరు నేతలతో కేటీఆర్ భేటీ

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యాచరణపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేరును ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి.. ఆయన పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం.

బయట పడిన చీకటి ఒప్పందం

» సభలో బీజేపీ, కాంగ్రెస్‌ల నైజం వెల్లడి

» చెవిలో పూలు పెట్టిన మోదీ, రేవంత్

» లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ సాయం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బయట పడిందని, ఆదిలాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి అలై బలై తీసుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోదీ వద్ద మోకరిల్లడాన్ని.. యావత్ తెలంగాణ చూసిందని, వారిద్దరి మధ్య ఉండే బడే భాయ్.. చోటే భాయ్ బంధం ప్రజల ముందే బహిర్గతమైందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో సోమవారం మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్, బీజేపీల మధ్య అవగాహన కుదిరిందని, ఉత్తర తెలంగాణలో బీజేపీకి కాంగ్రెస్ సహాయం చేస్తుందని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజల చెవిలో రేవంత్‌రెడ్డి కాలీఫ్లవర్ పెడితే.. మోదీ కమలం పువ్వు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటి రుణం అడిగితే.. కేంద్రం ఇబ్బంది పెట్టిందని.. అదే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తీసుకోవడానికి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ప్రధాని మోదీని సీఎం రేవంత్ ఒక్క మాట కూడా అనరని, మాజీ సీఎం కేసీఆర్‌పై మాత్రం ఒంటికాలితో లేస్తారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ.. అదానీ బంధంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేస్తుంటే.. రేవంత్ మాత్రం అదానీతో ఒప్పందం చేసుకుంటున్నారని, ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతల్లో ఎవరిని నమ్మాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి నిలదీశారు.

ఓఆర్ఆర్ లీజు బేస్ ప్రైస్ రూ.7300 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించడంపై నిరుడు ఏప్రిల్ 28న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికతో ప్రచురించిన కథనం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం సృష్టించింది. తాము అధికారంలోకి వచ్చాక దీనిపై విచారణ జరిపిస్తామని టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి అప్పట్లో ప్రకటించారు. సీఎం కాగానే దీనిపై హెచ్ఎండీఏ అధికారుల నుంచి పూర్తిస్థాయి నివేదిక కోరారు. టెండర్లు ఆహ్వానించినప్పుడు బేస్‌ప్రైస్‌ను ప్రభుత్వం ప్రకటించకపోయినప్పటికీ.. టెండర్ వేసిన నాలుగు సంస్థల్లో ఐఆర్‌బీ సంస్థ రూ.7272 కోట్లు, దినేష్‌చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్‌ఫ్రా రూ.7007 కోట్లు, గవర్ కన్‌స్ట్రక్షన్ రూ.6767 కోట్లు, ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్న ఈగల్ ఇన్‌ఫ్రా రూ.5643 కోట్ల మేర బిడ్‌లను కోట్ చేశాయి. అత్యధికంగా కోట్ చేసిన ఐఆర్‌బీ సంస్థను.. 'మరింత అధికంగా చెల్లిస్తారా?' అని ప్రభుత్వ వర్గాలు కోరగా రూ.7380 కోట్లు చెల్లించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఓఆర్ఆర్‌పై ఏటా పెరిగే వాహనాలు, 3 నుంచి 4 శాతం మేర పెరిగే టోల్ చార్జీలతో ఏడాదికి కనీసం ఐదు శాతం ఆదాయం పెరిగినా సర్కారుకు భారీగా ఆదాయం పెరుగుతుంది. అయినా.. 30 ఏళ్ల లీజుకు బేస్‌ప్రైస్‌ను రూ.7300 కోట్లుగా నిర్ణయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. ఓఆర్ఆర్ టీవోటీ ఫైనాన్షియల్ బిడ్‌ల ఇనిషియల్ ఎస్టిమేటెడ్ కన్సెషన్ వాల్యూను (ఐఈసీవీ) నిర్ధారించడానికి అప్పట్లో ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీయే రూ.7380 కోట్ల లీజు చెల్లించడానికి ఐఆర్‌బీ సంస్థను ఒప్పించినట్లు తెలిసింది. ఈ మేరకు.. గత ఏడాది ఆగస్టు 12 అర్ధరాత్రి నుంచి ఓఆర్ఆర్ ప్రైవేటు సంస్థ లీజులోకి వెళ్లగా, 11వ తేదీనే ప్రభుత్వానికి రూ.7380 కోట్ల చెక్కు అందింది. దాన్ని హెచ్ఎండీఏ ఖాతాలో 12న జమ చేయగా, మరుసటి రోజే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ సొమ్మును రాష్ట్ర ఖజానాకు మళ్లించారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ మహా నగర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు వాడతామని.. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కానీ, ఆ సొమ్మును రైతు రుణమాఫీకి వినియోగించినట్లు సమాచారం.

రహదారులు రక్తసిక్తం!

» రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం

కొత్తకోట, సదాశివపేట, పటాన్ చెరు, బోయినపల్లి, మార్చి 4: రాష్ట్రంలో రహదారులు రక్తసిక్తమయ్యాయి! వేర్వేరు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం చెందారు. నిశ్చితార్థానికి వెళ్తున్న కుటుంబసభ్యుల కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అందులోని వారిలో ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణం బసవన్నకుంటకు చెందిన సలీమాబీ మనవడు అలీకి హైదరాబాద్‌లోని ఓ కుటుంబంతో పెళ్లి సంబంధం ఖాయమైంది. సోమవారం హైదరాబాద్‌లో నిశ్చితార్థం ఉన్నందున సలీమా బీ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ఎర్టిగా కారులో బళ్లారి నుంచి బయలుదేరారు. అలీ డ్రైవింగ్ చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కొత్తకోట సమీపంలోని బైపాస్ రోడ్డులో వారి కారు జాతీయ రహదారి పక్కనున్న చెట్టును ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. దీంతో ఘటనా స్థలంలోనే అబ్దుల్ రెహమాన్ (39), రుమానా (2), సలీమా బీ (95), రోషిణి (4), హసిపా రిఫాత్ (7 నెలలు) మృతి చెందారు. అలీ, షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తర్వాత షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లను మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. అతివేగం, నిద్రమత్తు ప్రమాదానికి కారణంగా తెలుస్తోందన్నారు. ఈ ప్రమాదంలో చిన్నదెబ్బ కూడా తగలకుండా సమీరా (8) బయటపడింది.

ఇదిలా ఉండగా.. బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ దుర్మరణంపాలైన ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. సదాశివనగర్‌కు చెందిన దంపతులు ఏనుగు జనార్దన్ రెడ్డి(49), ఏనుగు ప్రతిభ (42) మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు స్కూటీపై బయలుదేరారు. పద్మాజీవాడి వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టడంతో స్కూటీపై నుంచి వారిద్దరూ కింద పడ్డారు. ప్రతిభపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. జనార్దన్ కాలుపై నుంచి కూడా వాహనం వెళ్లడంతో కాలు తెగి రోడ్డుకే అతుక్కుపోయింది. అతన్ని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే మృతి చెందాడు. కాగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐనోల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన సూరజ్(34), ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేందర్(30) అనే భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఆదివారం రాత్రి పల్సర్ బైక్‌పై పటాన్‌చెరు నుంచి ఐనోల్ మీదుగా కంజర్ల గ్రామం వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఇదిలా ఉండగా..రోడ్డు పక్కన పార్క్ చేసివున్న బొలేరో వాహనాన్ని షేక్ మహ్మద్ హుస్సేన్ (14) అనే విద్యార్థి నడుపుతున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. శనివారం జరిగిన ఘటనలో అతను చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా వెనుక కూర్చున్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.



వనపర్తి జిల్లా ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఔటర్‌పై కారు ఢీకొని.. ఆర్మీ జవాన్ దుర్మరణం

నార్సింగ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు దాటుతుండగా గచ్చిబౌలి నుంచి ఎయిర్ పోర్టు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆర్మీ జవాను మృతిచెందాడు. నార్సింగ్ వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది. ప్రమాదం అనంతరం వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. మృతుడు గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారని, అయన పేరు కులాన్ అని నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే కులాన్‌ను ఓ రెడీ మిక్సర్ వాహనం ఢీకొట్టినట్లు సమాచారం. ఘటన తర్వాత కులాన్ మృతదేహం చాలా సేపటి దాకా అక్కడే ఉందని, వాహనదారుల్లో ఎవ్వరూ పట్టించుకోలేదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు. మరి.. కులాన్ ఔటర్ రింగ్ రోడ్డువైపుకు ఎందుకు ఎక్కాడు? ఎక్కడికి వెళుతున్నాడు? అనే వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పాదచారులకు ఔటర్ రింగ్ రోడ్డుపైకి ప్రవేశం ఉండదు. కొంతమంది ఎయిర్ పోర్టుకు గానీ, గచ్చిబౌలికి గానీ వెళ్లాలన్నా ఔటర్ రింగ్‌రోడ్డుపైకి ఎక్కి షేరింగ్ ట్యాక్సీలను ఆపి ఎక్కడం లేదా లిఫ్ట్ అడిగి ఎక్కడం చేస్తుంటారు. ఆ రకంగా ఇతను ఎక్కడకైనా వెళ్లేందుకు వచ్చాడా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వరం అక్రమాలపై న్యాయవిచారణ

» కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 3(1) ప్రకారం ఆదేశిస్తాం

» సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో ఎంక్వైరీ

» మా విజ్ఞప్తి మేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్‌ఏ కమిటీ

» హైకోర్టుకు లిఖితపూర్వకంగా నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

» కాంగ్రెస్ నేత నిరంజన్ పిటిషన్ నాలుగు నెలలకు వాయిదా

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలపై న్యాయవిచారణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు లిఖిత పూర్వకంగా తెలిపింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 సెక్షన్ 3 (1) అధికారాలను ఉపయోగించుకుని విచారణకు ఆదేశిస్తామని నివేదించింది. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోమారు విచారణ చేపట్టింది. దీనిపై ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియజేయాలన్న హైకోర్టు గత ఆదేశాల మేరకు.. అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ వాదనను ధర్మాసనానికి తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నిరుడు అక్టోబర్ 24, 25 తేదీల్లో ప్రాజెక్టును సందర్శించి.. ప్రాథమిక విచారణ చేపట్టిందని.. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుకు కారణాలు వివరిస్తూ గత నవంబర్ 1న ప్రభుత్వానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని అథారిటీ తన లేఖలో సూచించిందని ఏజీ పేర్కొన్నారు. "డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేఖ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తునకు ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక దర్యాప్తును పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. సదరు ప్రాథమిక నివేదిక ఆధారంగా ప్రభుత్వం పలుచర్యలు తీసుకుంది. ఈఎన్సీ (ఐ) రామగుండం ఎన్.వెంకటేశ్వర్లు సర్వీసును టెర్మినేట్ చేశాం. దాంతోపాటు ఈఎన్సీ (జనరల్)ని రాజీనామా చేయాల్సిందిగా కోరాం. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తుది నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులైన అధికారులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం." అని వివరించారు. అలాగే.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలంటూ ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్ఏకి లేఖ రాసిందని.. ఈమేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్ఏ ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ మార్చి 1న ఆదేశాలిచ్చిందని వెల్లడించారు. బరాజ్‌ల దుస్థితికి కారణాలు.. పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సిఫారసు చేయనుందని చెప్పారు. ప్రభుత్వ వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల నేపథ్యంలో విచారణను నాలుగు నెలలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.



మహిళా సమస్యలపై అవగాహన సదస్సు

కరీమాబాద్, మార్చి 4: రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధులు మహిళల సమస్యలు - వాటి పరిష్కారాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు మాట్లాడుతూ విదార్థినులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి మహిళా సాధికారతను సాధించాలన్నారు.

ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ ఆర్.రుద్రాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్ ఎ.పావని, జెండర్ స్పెషలిస్ట్ ఎన్.హర్షిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే..

సంగెం, మార్చి 4: పేదలకోసం పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు చెప్పారు. సోమవారం ఖిలావరంగల్ మండలం జక్కలొద్దిలో గుడిసెలు వేసుకున్న 2౭వందల మంది కుటుంబాలు పలు పార్టీల నుంచి సీపీఐలో చేరారు. ఈసందర్భంగా వారందరికీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేశంతో కలిసి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ బూర్జువా పార్టీలు అధికారం కోసం కోసమే పనిచేస్తాయని, పార్టీలకు ఎన్నికలప్పుడే ప్రజా సమస్యలు గుర్తుకు వస్తాయని ఆరోపించారు. ఎర్ర జెండాలు ప్రజల మధ్యన నిరంతరం ఉంటాయన్నారు. పేదలకు ఇళ్లు, ఇండ్ల స్థలాల కోసం వందలాది మందిని సమీకరించి భూ పోరాటాలను చేసిన ఘనత తమదేనన్నారు. కార్యక్రమంలో మేకల రవి, కర్రె భిక్షపతి, పంజాల రమేష్, షేక్ బాసిమియా, ప్రసాద్, దండు లక్ష్మణ్, కరుణాకర్, అక్కపెల్లి రమేష్, ఎలేందర్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



మహాశివరాత్రి మహోత్సవాలను ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీధర్

వరంగల్‌టౌన్, మార్చి 4: కాశిబుగ్గ కాశీవిశ్వేశ్వరాలయంలో ఆ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహాశివరాత్రి ఉత్సవాలను ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ సీఐ శ్రీధర్ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్యస్వామి, అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి గోనె జగదీశ్వర్, మండల శ్రీరాములు, ఓరుగంటి కొంరయ్య, బోడకుంట్ల వైకుంఠం, మామిడి ఈశ్వరయ్య, ముచ్చర్ల ప్రభాకర్, వలుపదాసు గోపి, పాశికంటి రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే నాగరాజు జన్మదిన వేడుకలు

పోచమ్మమైదాన్, మార్చి 4: పైడిపెల్లిలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎలియ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు జన్ను అరుణాకర్ ఆధ్వర్యంలో ప్రమాదంలో గాయపడి ఐదు సంవత్సరాలుగా మంచానికి పరిమితమైన అశోక్ కుటుంబానికి 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జన్ను అభిషేకం, ఎరోల్ల ప్రసాద్, బోయిని ఐలయ్య, లింగం సంపత్, రూపేన్, జేసన్, జన్ను అనిల్‌కుమార్, రాము, యుగేందర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సారు సేవలో అటెండర్లు..

- హెచ్‌ఎంల వ్యక్తిగత పనులతో తరింపు..
- హెడ్మాస్టర్ల కనుసన్నల్లోనే ప్రైవేటు పనులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



వరంగల్ సిటీ, మార్చి 4: వరంగల్ జిల్లా విద్యాశాఖలో ఆఫీస్ సబార్డినేట్లు(అటెండర్లు) నిర్వర్తిస్తున్న విధులు విమర్శలకు తావిస్తున్నాయి. పాఠశాల నిర్వహణ పనుల్లో భాగస్వామ్యం కావాల్సిన వారు అమ్మవార్లు, అయ్యవార్లు(హెడ్మాస్టర్ల) వ్యక్తిగత సేవల్లో తరిస్తున్నారు. అసలు పనులు చేయకుండా ప్రధానోపాధ్యాయుల వ్యక్తిగత పనుల కోసమే తామున్నట్లు వ్యవహరిస్తున్న తీరు జిల్లా విద్యాశాఖలో చర్చనీయాంశగా మారింది. అవసరం లేని బడుల్లో ఇద్దరేసి సబార్డినేట్లు ఉండటం కూడా విమర్శలకు తావిస్తోంది. ఇక కొన్ని పాఠశాలల్లో అసలు అటెండర్లకు బదులుగా వేరొకరు విధులు నిర్వర్తిస్తుండడం, మరికొన్ని పాఠశాలల్లో అటెండర్లు కొంత మందికి డబ్బులు ఇస్తూ ప్రైవేటు వ్యక్తులతో వారి పనులు చేయించుకుంటున్న సంఘటనలు జరుగుతున్నాయి. ప్రధానోపాధ్యాయుల కనుసన్నల్లోనే ఇలాంటి వ్యవహారాలు జరుగుతుండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్జేడీ, డీఈవోల దృష్టికి వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి.

● అదనంగా ఉన్నది ఇక్కడే...

జిల్లాలో మొత్తం 37 అటెండర్ పోస్టులు ఉండగా ప్రస్తుతం జిల్లాలో 27 మంది వివిధ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే జిల్లాలో అటెండర్లు ఎవరెక్కడ పనిచేస్తున్నారో సైతం తెలియని పరిస్థితిలో జిల్లా విద్యాశాఖ యంత్రాంగం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఖిలావరంగల్ మండలంలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు, శివనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు, మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో ముగ్గురు, శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో ముగ్గురేసి అటెండర్లు పనిచేస్తున్నారు. ఇక కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైతం ఒకరు రెగ్యులర్ అటెండర్ ఉండగా మరో అటెండర్ డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఎక్కువ మంది విద్యార్థులున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మాత్రం ఎక్కడా అటెండర్లు కానరావడం లేదు.

● ప్రధానోపాధ్యాయుల కనుసన్నల్లోనే...

కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల వ్యక్తిగత పనులు చేసి పెట్టేందుకే ఒక్కో అటెండర్ పనిచేస్తుండం విశేషం. వ్యక్తిగత పనుల కోసం కొన్ని చోట్ల డిప్యూటేషన్‌పై సైతం అటెండర్లను తీసుకువచ్చుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇక కొన్ని చోట్ల అసలు అటెండర్‌కు బదులుగా ప్రైవేటు వ్యక్తులు బడుల్లో పని చేస్తు న్నారు. మరికొన్ని పాఠశాలల్లో అటెండర్లు నిర్వర్తించాల్సిన పనులను వారు డబ్బులు ఇస్తూ ప్రైవేటు వ్యక్తులు వ్యక్తిగత పనులు చేయించుకుంటున్నారు. ఇవన్నీ సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలిసే జరుగుతున్నాయి. కొందరు హెడ్మాస్టర్లు వ్యక్తిగత పనులు చేయడంతో పాటు ఉపాధ్యాయులకు టీ, కాఫీలు చేసి పెడుతుండటం తప్ప వేరే పనులు చేయడం లేదనే విమర్శలున్నాయి. విద్యార్థులతో పాల ప్యాకెట్లు తెప్పిస్తూ ఇతరత్ర పనులు చేస్తున్నారనే విమర్శలున్నాయి.



ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కళావతి

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

సంగెం, మార్చి 4: ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో పలు కార్యక్రమాలను చేపడుతోందని సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల అమలు చేస్తున్న దశలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వాటిలో తప్పులు దొర్లినవాటి స్థానంలో తిరిగి దరఖాస్తు చేసుకునే వెసులు బాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, గ్రామ ఎంపీటీసీ మల్లయ్య, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో కొమురయ్య పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

సంగెం, మార్చి 4: తిమ్మాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత ఎన్.సుహాసిని పరీక్ష ప్యాడ్‌లను అందించారు. సోమవారం పాఠశాల ఆవరణలో టెన్త్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్యాడ్లతో పాటు పెన్నులు, పెన్సిల్స్, స్కేలులను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్, పాఠశాల శ్యాంకుమార్, సుధాకర్, ఆనంద్, వేంకటేశ్వర్లు, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

బల్దియా ప్రజావాణికి 76 వినతులు

స్వీకరించిన అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), మార్చి 4 : బల్దియా ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, వివిధ విభాగాల ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 76 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి 16 వితనులు, హెల్త్, శానిటేషన్‌కు 6, ప్రాపర్టీ టాక్స్ (రెవెన్యూ) 14, టౌన్ ప్లానింగ్ 40 వినతులు అందినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ వెంకన్న, ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, బయాలసిస్టు మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్ లింగం, ఓ.రమేశ్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఎలాంటి అనుమతి లేకుండా అక్రంగా భవన నిర్మాణం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ మిద్దెల బాబు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. 31వ డివిజన్‌లోని హనుమకొండ రెవెన్యూ శివారు ప్లాట్ నెంబరు 43, శాయినగర్ కాలనీ పక్కన 278 చ.గ సొంత పట్టాగల భూమిని ఆక్రమించి, నిర్మాణం చేస్తున్నారని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్

● గ్రేటర్ 50వ డివిజన్ పరిధిలో సరైన సైడ్ డ్రెయినేజీ నిర్మాణం లేకపోవడంతో దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమల వృద్ధి చెందుతున్నాయని కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు.

● ప్రభుత్వ అనుమతి, ఎలాంటి నిబంధనలు పాటించకుండా భవన నిర్మాణాలు చేపడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నేత డి.తిరుపతి వినతిపత్రం సమర్పించారు.

● ఒకటవ డివిజన్ పలివేల్పుల గ్రామంలో ఇల్లు నిర్మించుకుంటే ఆ ఇంటికి 2వ డివిజన్ గుండ్ల సింగారం ఇంటి నెంబరు కేటాయించారని ఈ నెంబరు మార్చాలని జంగ రమేశ్‌బాబు వినతి పత్రం సమర్పించారు.

టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో నేడు మహిళా దినోత్సవం

వరంగల్ కలెక్టరేట్, మార్చి 4: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించబడునని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా అదనపు కలెక్టర్లు అశ్వినితానాజీ వాకడే, జి.సంధ్యారాణి, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరవుతారని, జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సీకేఎం కళాశాలలో ఉమెన్స్ డే వేడుకలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌రావు

పోచమ్మమైదాన్, మార్చి 4: దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో ఉమెన్స్ డేను పురస్కరించుకొని సోమవారం వేడుకలు నిర్వహించారు. కళాశాల లైబ్రరీ, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు సమాజంలో మహిళల పై జరిగే అకృత్యాలపై పాటలు, కవితల పోటీలు నిర్వహించారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి, లైబ్రరీయన్ అనిల్, సుమలత, మోహన్, కుమార్, కెప్టెన్ సతీష్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

క్వెంట్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న చక్రపాణి

వరంగల్‌టౌన్, మార్చి 4: కాశిబుగ్గ వివేకానందకాలనీ బాలజ్యోతి హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. నవంబరులో హైదరాబాద్‌లో జరిగిన క్వెస్ట్ ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో ఫలితాలు ఆదివారం విడుదల కాగా, ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఈమేరకు సోమవారం హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ పొన్నోజు దేవిక, కరస్పాండెంట్ పొన్నోజు చక్రపాణి ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ర్యాంకులు సాధించిన భార్గవ్ 7వ ర్యాంక్, పూజిత్ మహేంద్ర 11 వ ర్యాంక్, సిద్దార్థ 14వ ర్యాంక్, స్వాతిక్ 15వ ర్యాంక్, అఖిల్ బాబు 27వ ర్యాంక్ సాధించిన విద్యార్థులను అభినందించారు.

కలెక్టర్, అధికారులపై ఫిర్యాదు

- సోషల్ మీడియాలో ఫిర్యాదు రసీదు వైరల్
- ఖండించిన సీఐ, తహసీల్దార్

వరంగల్‌టౌన్, మార్చి 4: దేశాయిపేట చిన్నవడ్డెపల్లి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని జన్ను నూతన్‌కుమార్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులపై ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, రెవెన్యూ డివిజనల్ అధికారి వాసుచంద్ర, ఎస్ఈ ఇరిగేషన్ హర్షవర్ధన్, గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాధికా గుప్తా, డిప్యూటీ కమిషనర్ కాశిబుగ్గ సర్కిల్, అనిల్‌కుమార్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ కాశిబుగ్గ సర్కిల్, ఇతర అధికారులున్నారు. నూతన్‌కుమార్ ఫిర్యాదును స్వీకరించినట్లు పోలీసులు రశీదు సైతం ఇచ్చారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవడంతో పోలీసులు మాటమార్చినట్లు తెలుస్తోంది.

ఖండించిన ఎస్‌హెచ్‌వో

జన్ను నూతన్‌కుమార్ అనే వ్యక్తి ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మాత్రమే పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చాడని ఇంతేజార్‌గంజ్ ఎస్‌హెచ్‌వో పవన్‌కుమార్ వెల్లడించారు. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులపై ఫిర్యాదు ఇచ్చినట్లుగా సోషల్ మీడియాలో తప్పుగా ప్రచారం జరుగుతోందని, దీనిలో నిజం లేదని పేర్కొన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కలెక్టర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

వరంగల్ మండల తహసీల్దార్ ఎండి.ఎక్బాల్ మాట్లాడుతూ కలెక్టర్ ప్రావీణ్యపై దేశాయిపేటకు చెందిన నూతన్‌కుమార్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదును వెంటనే వెనక్కి తీసుకుని, కలెక్టర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. సర్వే నంబర్ 302లో నెలకొన్న సమస్య పూర్తిగా సివిల్ అంశమని, అతడికి ఏదైనా ఇబ్బంది ఉంటే కోర్టులో తేల్చుకోవాలని పేర్కొన్నారు.

బీజేపీ డివిజన్ అధ్యక్షుల ఎంపిక



ముద్దసాని కృష్ణ



నాంద్రే అమర్



అంకాల జనార్దన్



బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న విప్ప సుధాకర్

ఖిలావరంగల్, మార్చి 4: భారతీయ జనతా పార్టీ 33, 37, 38 డివిజన్ అధ్యక్షులను ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవి కుమార్ నియమించారు. పెరకవాడకు చెందిన సీనియర్ నాయకుడు ముద్దసాని కృష్ణను 33వ డివిజన్ అధ్యక్షుడుగా, తూర్పుకోటకు చెందిన నాంద్రే అమర్‌ను 37వ డివిజన్ అధ్యక్షుడిగా అలాగే 38వ డివిజన్ అఅధ్యక్షుడిగా అంకాల జనార్దన్‌ను నియమించినట్లు రవికుమార్ పేర్కొన్నారు. జనార్దన్ గతంలో మూడుసార్లు బీజేపీ డివిజన్ అధ్యక్షుడుగా, మజ్దూర్ మోర్చా జిల్లా కార్యదర్శిగా, కార్యవర్గ సభ్యులుగా వ్యవహరించారన్నారు. ఎన్నికైన అధ్యక్షులు పార్టీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు, వరంగల్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల కిరణ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమళ్ళ మహేష్, మంద శ్రీనివాస్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

● పోచమ్మమైదాన్ : బీజేపీ 12వ డివిజన్ అధ్యక్షుడిగా దేశాయిపేటకు చెందిన విప్ప సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ నియామక ఉత్తర్వులు అందజేశారు. సుధాకర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, బాకం హరిశంకర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎంలో వివిధ పోస్టులకు 2,234 దరఖాస్తులు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 4: వైద్య ఆరోగ్య శాఖలో ఇటీవల ఎన్‌హెచ్‌ఎంలో వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా సోమవారం మొత్తం 2,234 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో స్టాఫ్ నర్స్ 223, ఎంబీబీఎస్ 29, డీఏఎంఎస్ 87, ఫిజీషియన్ 2, ఎంబీబీఎస్ మెడికల్ ఆఫీసర్లు 17, ఎపిడొమలాజిస్టు 15, ఫార్మాసిస్టులు 190, డీఈవో 64, టీబీహెచ్‌వీ 34, సపోర్టింగ్ స్టాఫ్ 53, ఎన్‌సీడీ స్టాఫ్ నర్స్ 1,520 మొత్తం 2,234 దరఖాస్తులు వచ్చాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. వీటిని నిర్దేశించిన సమయంలో స్క్రూటిని చేసి మెరిట్ ప్రకారం ఆర్‌వోఆర్ ప్రకారం నియమిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

స్టీరింగ్ రాడ్ విరిగి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన పాఠశాల బస్సు

చెన్నారావుపేట, మార్చి 4 : విద్యార్థులను ఇంటికి తీసుకెళుతున్న ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు స్టీరింగ్ రాడ్ విరగడంతో అదుపు తప్పి పక్కను దూసుకెళ్లిన సంఘటన మండలంలోని జల్లి గ్రామం క్రాస్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథ నం ప్రకారం... మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్‌లోని సెయింట్ థెరిసా పాఠశాలకు చెందిన బస్సులో డ్రైవర్ కిరణ్ 57 మంది విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లడానికి ఎక్కించుకొని జల్లి గ్రామానికి వస్తున్నాడు. జల్లి గ్రామ క్రాస్ రోడ్డు వద్దకు రాగానే స్టీరింగ్ రాడ్ విరగటంతో బస్సు ప్రమాదవశాత్తు పక్కకు దూసుకెళ్లింది.




రోడ్డు పక్కకు దూసుకెళ్లిన పాఠశాల బస్సు

ఈ ఘటనలో విద్యార్థులకు ఎలాంటి హాని జరుగకపోవటంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు సంఘటనాస్థలికి చేరుకొని పిల్లాలను ఇంటికి తీసుకెళ్లారు. విషయంగా తెలుకున్న ఎస్సై గూడ అరుణ్‌కుమార్ ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కేయూ క్యాంపస్, మార్చి 4: కాకతీయ యూనివర్సిటీ పార్టుటైం అధ్యాపకుల సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ హామీ ఇచ్చారు. గత వారం రోజులుగా కేయూ పరిపాలన భవనం ఎదుట నిరసన చేస్తున్న పార్టుటైం అధ్యాపకుల సమస్యలను సోమవారం వీసీ తాటికొండ రమేశ్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అనుమతి ఇవ్వగానే సమస్యలను పరిష్కరిస్తామని తెలుపడంతో పార్టుటైం అధ్యాపకులు నిరాహార దీక్షలను విరమించినట్లు ప్రకటించారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతుడు

గిర్మాజీపేట, మార్చి 4: వరంగల్-చింతల్‌పల్లి రైల్వేస్టేషన్ల మధ్య అబ్బనికుంటమైసమ్మ ప్రాంతంలో విజయవాడ నుంచి వరంగల్ వైపు వస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి గుర్తు తెలియని ప్రయాణికుడు (25) మృతి చెందినట్లు సోమవారం వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ తెలిపారు. మృతుడు 5 అడుగుల 4అంగుళాల ఎత్తు, ఛామన చాయ శరీరం రంగు, ఎడమ చేతిపై పుట్టుమచ్చ కలిగి ఉన్నాడని చెప్పారు.మృతుడి ప్యాంటు జేబులో ఆదివారం(3వతేది) ఉదయం 7.32 గంటలకు కెంపెగౌడ కర్నాటక ఆర్టీసి బస్‌స్టేషన్ నుంచి శ్రీ విశ్వేశ్వరయ్య రైల్వేస్టేషన్‌కు ప్రయాణించినట్లు కర్నాటక ఆర్‌టీసి బస్ టికెట్ లభించిందని తెలిపారు. ఈ టికెట్ ఆధారంగా మృతుడు బెంగళూరు నుంచి హైదరాబాద్/ న్యూఢిల్లీ వైపు ప్రయాణిస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లుగా అనుమానిస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురిలో భద్రపరిచి ఎస్సై ఎం.ఐలయ్య కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి సంబంధీకులు 99594 25483/87126 58585 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సీఐ కోరారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), మార్చి 4: హనుమకొండ నయీంనగర్ ప్రధాన రహదారిలో సోమవారం అక్రమ నిర్మాణాలను జీడబ్ల్యూఎంసీ సిబ్బంది కూల్చివేశారు. ఇది వరకే నోటీసులు జారీ చేసినా కూడా లెక్క చేయకుండా నిర్మాణాలు సాగిస్తున్న యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలను తొలగించారు.

భూ సమస్యల పరిష్కార ప్రత్యేక సమావేశాలు ప్రారంభం

నెక్కొండ, మార్చి 4 : గ్రామాల్లోని రైతులకు సంబంధిం భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 9వ తేది వరకూ ప్రత్యేక సమావేశాలు జరుగుతాయని తహసీల్దార్ రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. భూ సమస్యల పరిష్కార గ్రామ సభలు సోమవారం నుంచి ప్రారంభించామన్నారు. మండలంలోని 18 రెవెన్యూ గ్రామాల పరిధిల్లోని 39 గ్రామ పంచాయతీల్లో ఈ సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశాల్లో గతంలో ధరణిలో ఇచ్చిన దరఖాస్తులను, తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గ్రామాల్లో పరిశీలించి సమగ్ర నివేదికలను సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. దీనికిగాను అధికారులను బృందాలుగా తయారు చేశామన్నారు. రైతులు గ్రామాల్లో సభలకు హాజరై వారికి సంబంధించిన భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



మైలారంలో గృహజ్యోతిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాయపర్తి, మార్చి 4 : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే సాధ్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మైలారంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని మహిళా సమైఖ్య భవనంలో ఏర్పాటు చేసిన కిసాన్ సమృద్ధి యోజన చెక్కులను, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి, అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడంతో పాటు పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండాలనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి విజన్‌తో పనిచేస్తున్నాడని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు భరోసా ఉంటుందని, అందుకోసం ఆరు గ్యారెంటీలను తీసుకువచ్చి ఇందిరమ్మ రాజ్య స్థాపనకు కృషి చేస్తున్నాడని వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. స్త్రీ జీవితంలో అమ్మగా, అక్కగా, చెల్లిగా, భార్యగానే కాకుండా సమాజాన్ని మేలు చేసే విధంగా చైతన్య వంతులు కావాలన్నారు. మహిళల మేధోపరమైన భాగస్వామ్యం లేనిదే ఏ దేశాలు, ఏ జాతి ముందడుగు వేయలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, అధికారులు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్, ఏపీఎం కిరణ్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్, నాయకుడు ప్రభాకర్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

చెన్నారావుపేట, మార్చి 4: రానున్న వేసవి కాలంలో గ్రామాలల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ శ్రీనువాస రావు అన్నారు. సోమవారం మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలో తాగు నీటి సరఫరాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతీ రోజు గ్రామాలల్లో తాగు నీటిని ప్రజలకు సరాఫరా చేయాలన్నారు. గ్రామాలల్లో స్పెషల్ ఆఫీసర్‌లు. పంచాయితీ కార్యదర్శులు తాగు నీటి ఎద్దడి లేకుండా చూడలన్నారు. తాగు నీటి సరాఫరా విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించరాదన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణరెడ్డి, డీఈ మంగీలాల్, ఏఈ సతీష్, కార్యదర్శి వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని స్పెషల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక ప్రణాళిక చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

దుగ్గొండి, మార్చి 4 : మండల కేంద్రంలోని పీహెచ్‌సిని జిల్లా ఉప వైద్యాధికారి ప్రకాశ్ సోమవారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పల్స్ పోలియో చుక్కలు చిన్న పిల్లలకు 100 శాతం వేయించాలని, ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌రాజు, హెచ్‌ఈవో సాంబయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్, డైరెక్టర్ల కూర్పు పై కాంగ్రెస్ కసరత్తు

- వర్ధన్నపేట ఏఎంసీ ఎస్సీ జనరల్‌కు రిజర్వు!
- పోటీపడుతున్న ఆశావహులు
- అవకాశం ఎవరికనే దాని పై ఉత్కంఠ
- ఎమ్మెల్యే నాగరాజు వద్ద పలువురి పేర్లు



ఇల్లందలో వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం

వర్ధన్నపేట రూరల్, మార్చి 4 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసింది. ఈ మేరకు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం సైతం దాదాపు గత 20 రోజుల క్రితం రద్దయింది. దీంతో నూతన పాలకవర్గానికి కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే వివిధ జిల్లాల్లో రద్దయిన కమిటీల స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కమిటీ ఏర్పాట్లకు రిజర్వేషన్లను సైతం ఖరారుచేసింది. దీనిలో భాగంగా వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలోని మార్కెట్‌కు కొత్త పాలకవర్గం కొలువుదీరనుంది. ఈసారి మార్కెట్ చైర్మన్ ఎస్సీ జనరల్‌గా రిజర్వు అయినట్లుగా తెలుస్తోంది. మరో రెండు రోజుల్లో ప్రభుత్వం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని మార్కెట్ అధికారులు భావిస్తున్నారు.

చైర్మన్ కోసం కాంగ్రెస్ కసరత్తు...

నామినేటెడ్ పోస్టుల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టు కీలకంగా ఉంటుంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత ఆ స్థాయిలో ప్రోటోకాల్ కలిగిన పోస్టు కావడంతో సీనియర్, జూనియర్ నేతలు అప్పుడే పైరవీలు మొదలు పెట్టారు. వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ పరిధిలో వర్ధన్నపేట మండలంతో పాటు రాయపర్తి, ఐనవోలు మండలాలు కూడా ఉన్నాయి. అయితే గతంనుంచి వర్ధన్నపేట మండలానికి చెందిన వ్యక్తినే ఇక్కడ చైర్మన్‌గా పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇతర మండలాలకు చెందిన వారికి వైస్ చైర్మన్, డైరెక్టర్లుగా అవకాశం కల్పిస్తారు. కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పనిచేస్తున్న నాయకుల్లో మూడు మండలాల నుంచి పేర్లను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు నిశితంగా పరిశీలిస్తున్నాడు. ఎస్సీ జనరల్‌గా రిజర్వు కావడంతో కాంగ్రెస్‌లో అంత పెద్దగా వర్ధన్నపేట మండలం నుంచి ఆశావాహులు లేనట్లుగా తెలుస్తోంది. కట్ర్యాల గ్రామానికి చెందిన జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య చైర్మన్ రేసులో ఉండగా, రాయపర్తి నుంచి మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్ పేరు వినిపిస్తోంది. అయితే వీరిద్దరినే కాకుండా నాయకుల పేర్లను సైతం ఎమ్మెల్యే పరిశీలిస్తున్నట్లు సమాచారం.

చైర్మన్‌గా వెంకటయ్య ?

మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరుకుడు వెంకటయ్యను చైర్మన్‌గా చేసేందుకు అధిష్టానం దాదాపు ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నరుకుడు వెంకటయ్య కాంగ్రెస్‌కు విధేయునిగా ఉన్నారు. గత పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఎల్లప్పుడు ప్రభుత్వ తప్పిదాలను ఎండగడుతూ వస్తున్నారు. ఇటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో సత్సంబంధాలు ఉండడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావుకు సైతం నమ్మిన బంటుగా పేరుంది. ఇక మండలంలోని ఏ గ్రామంలో కూడా ఇతనికంటే సీనియర్ నాయకులు లేరని పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఇక వైస్ చైర్మన్‌పదవి రాయపర్తి మండలానికి వెళ్తుందా, ఐనవోలు మండలానికి వరిస్తుందా వేచి చూడాలి.

పాలకవర్గ ఏర్పాటుకు నిబంధనలు ఇవే...

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తులు, పశుగణన మార్కెట్ల చట్టం 1966 సెక్షన్-5(1) ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం ప్రతి మార్కెట్‌కు 18 మంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటుకానుంది. మార్కెట్ కమిటీ పరిధిలో సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయోత్పత్తిదారులు,పాడి రైతులు అర్హులుగా ఉంటారు. వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు ఉండాలి. కమిటీలో లైసెన్సు పొందిన ట్రేడ్ వ్యాపారులు ఇద్దరుఉండాలి. ఇక పాడి రైతులు సైతం వెటర్నరీ అధికారుల నుంచి గొర్లు, పశువులు ఉన్నట్లుగా సర్టిఫికేట్ అందించాల్సి ఉంటుంది. చైర్మన్‌గా నియమింపబడే వ్యక్తిపేరు మీద తప్పనిసరిగా వ్యవసాయ భూమి పట్టాపుస్తకం కలిగి ఉండాలి. మార్కెట్ కమిటీ చైర్మన్‌ను 12మంది రైతుల నుంచి ఒకరిని నియమిస్తారు. వైస్ చైర్మన్‌ను లైసెన్స్ ట్రేడర్స్ సభ్యుల నుంచి లేదా రైతు సభ్యుల నుంచి నియమించవచ్చు.

నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు...

మార్కెట్ పరిధిలోని పీఏసీఎస్, సహకార మార్కెటింగ్ సంఘాల ఒక సభ్యుడు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఒకరు, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్యశాఖ అధికారుల్లో ఒక సభ్యుడు ఉంటారు. మార్కెట్ కమిటీ పరిధిలోని మేయర్, మునిసిపల్ చైర్‌పర్సన్ లేదా గ్రామసర్పంచ్ ఒకరు ఉంటారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం



ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట టౌన్, మార్చి 4 : నర్సంపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నదన్నారు. ప్రజా పాలన కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ప్రజా పాలన సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోతె కళావతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

● నల్లబెల్లి: ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో నరసింహమూర్తి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీడీవో, ఎంపీవోలు ఏర్పాటు చేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాలకు అర్హులైన ప్రజలందరూ దరఖాస్తులను ఇవ్వవచ్చన్నారు. దరఖాస్తుల్లో ఏమైనా తప్పులు దొర్లితే ఈ ప్రజాపాలన సేవా కేంద్రాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కూచన ప్రకాష్, ప్రజాపాలన కౌంటర్ ఇనార్జీ గంగాధర్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

● దుగ్గొండి : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా పాలనలో భాగంగా నిరంతరం అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందుటకు ప్రజాపాలన సేవా కేంద్రం ద్వారా పొందడం జరుగుతుందని ఎంపీడీవో ఆరుంధతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సేవా కేంద్రాన్ని ఎంపీడీవో ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌గౌడ్, సూపరింటెండెంట్ రవికుమార్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాన్ని ఎంపీపీ అన్నమనేని అప్పారావు ప్రారంభించి మాట్లాడారు. ఇంతకుముందు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని,తప్పులు దొర్లినవారు మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశముందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ పాల్గొన్నారు.

● రాయపర్తి : ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పర్వతగిరి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. ఎంపీడీవో శంకర్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఎవరికైనా అర్హత ఉండి పథకాలు అందకపోతే తమకు చెందిన పూర్తి ఆధారాలతో తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

అలరిస్తున్న నాటక పోటీలు



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

వర్ధన్నపేట, మార్చి 4 : భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటక పోటీలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. సోమవారం రెండు నాటక ప్రదర్శనలు నిర్వహించగా ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాంజలి హైదరాబాద్ వారు రైతే రాజు నాటకాన్ని ప్రదర్శించగా, చైతన్య కళాభారతి కరీంనగర్ వారు స్వప్నం రాల్చిన అమృతం అనే నాటక ప్రదర్శన ఇచ్చారు. ఈ రెండు నాటికల్లో కళాకారులు తమ పాత్రల్లో తమదైన శైలీలో నటించి వీక్షకులను మెప్పించారు.

గిరిజన తండాల్లో బొడ్రాయి ప్రతిష్ఠాపన

నెక్కొండ, మార్చి 4 : మండలంలోని అజ్మీర మంగ్యా తండ గ్రామ పరిధిలోని మామిడితోటతండ, మూడ్‌నర్సింహా తండ, జగన్నాధరావుతండ, బోరింగ్‌తండ, గొల్లగూడెంలో సోమవారం బొడ్రాయి (గ్రామదేవత, నాభిశిల) ప్రతిష్ఠాపన, గుడి పండుగలను గిరిజన ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. ఈ తండాల్లోని దేవాలయాల్లో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఎంపీటీసీ కునుసోతు సరోజశంకర్, మాజీ సర్పంచ్ సరోజవెంకట్, ఆలయ కమిటి చైర్మన్ మాలోతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

● గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు

వర్ధన్నపేట, మార్చి 4 : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల, అరబిందో పాఠశాలలు కనీసం పాఠశాల పేరు కనిపించకుండా నడుస్తున్నాయని, ఆ పాఠశాలల యజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు అమ్మకూడదని నిబంధనలు ఉన్నా నిబంధనలు తుంగలో తొక్కి విక్రయిస్తున్నట్లు తెలిపారు. సమగ్ర విచారణ జరిపి సదరు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు సమయం పాటించాలి

రాయపర్తి, మార్చి 4 : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తప్పని సరిగా సమయపాలన పాటించాలని నోడల్ ఆఫీసర్ సుజన్ తేజ అన్నారు. సోమవారం మండలంలోని కొండూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు మెరుగైన రీతిలో పాఠాలు బోధించి వారిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే విధంగా చూడాలన్నారు. ప్రతీ రోజు ఉదయం 10గంటల లోపే పిల్లలకు ఎఫ్ఆర్ఎస్ చేయాలని సూచించారు. పిల్లల హాజరు శాతం, పిల్లల మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే నాగరాజు జన్మదిన వేడుకలు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, మార్చి 4 : వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు జన్మదిన వేడుకలను హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజుకు పుష్ప గుచ్ఛం అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం జన్మదిన కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో మెట్టుగుట్ట ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఆలయ అర్చకులు, ఎల్ఐసీ ప్రభాకర్, మార్నేని వెంకటేశ్వర్‌రావు తోపాటు వర్ధన్నపేట నియోజకవర్గకాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే నాగరాజు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

● వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ల్యాబర్తి గ్రామంలో సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ మండల సెక్రటరీ కుల్ల యాకాంతం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్‌పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లం రాజేష్, తోట రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు జన్మదిన వేడుకలను పర్వతగిరి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి గ్రామస్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన వంగా రాంబాబుగౌడ్ మండలంలోని అన్నారంషరీఫ్ గ్రామంలోని దర్గా వద్ద 400 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, నాయకులు సునీల్‌రావు, గంగాధర్‌రావు, పూర్ణచందర్, అనీల్, చలపతిరావు, రాంచందర్, గురువారావు, మహేంద్ర, సావిత్రి, సువర్ణ, రమేష్, సంతోష్, వినయ్, అఖిల్, మధు, వెంకన్న, మహేందర్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, అధికారులపై ఫిర్యాదు

● సోషల్ మీడియాలో ఫిర్యాదు రసీదు వైరల్ ● ఖండించిన సీఐ, తహసీల్దార్

వరంగల్‌టౌన్, మార్చి 4 : దేశాయిపేట చిన్నవడ్డెపల్లి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని జన్ను నూతన్‌కుమార్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో కలెక్టర్ తోపాటు పలువురు అధికారులపై ఫిర్యాదు చేశారు.

ఆ ఫిర్యాదులో వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, రెవెన్యూ డివిజనల్ అధికారి వాసుచంద్ర, ఎస్ఈ ఇరిగేషన్ హర్షవర్ధన్, గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాధికా గుప్తా, డిప్యూటీ కమిషనర్ కాశిబుగ్గ సర్కిల్, అనిల్‌కుమార్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ కాశిబుగ్గ సర్కిల్, ఇతర అధికారులున్నారు. నూతన్‌కుమార్ ఫిర్యాదును స్వీకరించినట్లు పోలీసులు రశీదు సైతం ఇచ్చారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవడంతో పోలీసులు మాటమార్చినట్టు తెలుస్తోంది.

ఖండించిన ఎస్‌హెచ్‌వో

జన్ను నూతన్‌కుమార్ అనే వ్యక్తి ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మాత్రమే పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చాడని ఇంతేజార్‌గంజ్ ఎస్‌హెచ్‌వో పవన్‌కుమార్ వెల్లడించారు. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులపై ఫిర్యాదు ఇచ్చినట్లుగా సోషల్ మీడియాలో తప్పుగా ప్రచారం జరుగుతోందని, దీనిలో నిజం లేదని పేర్కొన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కలెక్టర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

వరంగల్ మండల తహసీల్దార్ ఎండి.ఎక్బాల్ మాట్లాడుతూ కలెక్టర్ ప్రావీణ్యపై దేశాయిపేటకు చెందిన నూతన్‌కుమార్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదును వెంటనే వెనక్కి తీసుకుని, కలెక్టర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. సర్వే నంబర్ 302లో నెలకొన్న సమస్య పూర్తిగా సివిల్ అంశమని, అతడికి ఏదైనా ఇబ్బంది ఉంటే కోర్టులో తేల్చుకోవాలని పేర్కొన్నారు.

మహిళలకు సబ్సిడీ రుణాలు



పసుపు బ్రాయిలర్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఏజీఎం

ఖానాపురం, మార్చి 4 : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఉపాధిపై శిక్షణలతో పాటు సబ్సిడిపై రుణాలు అందించడం జరుగుతుందని నాబోర్డు ఏజీఎం రవితంగ అన్నారు. మండలంలోని రాగంపేటలో నాబార్డు సహకారంతో రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో 60 మంది మహిళలకు సారి పెట్టికోట్‌పై 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వగా వారికి సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. రైతు ఉత్పత్తి సంఘానికి స్పైస్ బోర్డు ద్వారా 99 శాతం సబ్సిడీపై అందించిన పసుపు బ్రాయిలర్ యంత్రంను ఏజీఎం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఉత్పత్తి దారుల సీఈవో మౌనిక, డైరెక్టర్లు జ్యోతి, శ్రీలత, రంగు కవిత, వెంకన్న ప్రోగ్రాం మేనేజర్ శిరిషలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ జడ్పీటీసీ



పార్టీలోకి ఆహ్వానించిన కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి

వర్ధన్నపేట, మార్చి 4 : వర్ధన్నపేట మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సారంగపాణి వర్ధన్నపేట పట్టణ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పిన్నింటి వెంకటేశ్వర్‌రావు, బక్కతట్ల రాజు యాదవ్, పూజారి శ్రీనివాస్‌గౌడ్, బి.శ్రీనివాస్ యాదవ్, అంగోతు శ్రీనివాస్, అంగోతు వీరన్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, అబ్బిడి రాజిరెడ్డి, సునావత్ కీమానాయక్, సోము, సురేష్, అంగోతు శ్రీనివాస్, రమేశ్, భిక్షపతి, వెంకట్‌రావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా



కృష్ణ చైతన్యరెడ్డి

చెన్నారావుపేట, మార్చి 4: బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల ఇన్‌చార్జిగా ఉన్న కంది కృష్ణ చైతన్య రెడ్డి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తనకు పార్టీలో మంచి గుర్తింపు ఇచ్చి, సహకరించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

స్టీరింగ్ రాడ్ విరిగి పక్కకు దూసుకెళ్లిన స్కూల్ బస్సు



జల్లి గ్రామం వద్ద పక్కకు దూసుకెళ్లిన పాఠశాల బస్సు

చెన్నారావుపేట, మార్చి 4 : విద్యార్థులను ఇంటికి తీసుకెళుతున్న ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు స్టీరింగ్ రాడ్ విరగడంతో అదుపు తప్పి పక్కను దూసుకెళ్లిన సంఘటన మండలంలోని జల్లి గ్రామం క్రాస్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు... మండలంలోని తిమ్మారాయిన్‌పహడ్ గ్రామంలోని సెయింట్ థెరిసా పాఠశాలకు చెందిన బస్సు డ్రైవర్ కిరణ్ 57 మంది విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లడానికి ఎక్కించుకొని జల్లి గ్రామానికి వస్తున్నాడు. జల్లి గ్రామ క్రాస్ రోడ్డు వద్దకు రాగానే బస్సు స్టీరింగ్ రాడ్ విరగటంతో ప్రమాదవశాత్తు పక్కకు దూసుకెళ్లింది. విద్యార్థులకు ఎలాంటి హాని జరుగక పోవటంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం తల్లిదండ్రులు సంఘటనాస్థలికి చేరుకొని తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. విషయంగా తెలుకున్న ఎస్సై గూడ అరుణ్‌కుమార్ ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

రేపు నెక్కొండ మండల సభ

నెక్కొండ, మార్చి 4 : బుధవారం నెక్కొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీపీ జాటోతు రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని, ఎంపీటీసీలు సభకు హాజరై మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను, ప్రజా సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయపర్తి, మార్చి 4 : పర్వతగిరి మండల పరిధిలోని దూపతండా, చౌటపెల్లి, చింతనెక్కొండ, రెడ్లవాడ ఇండస్ట్రియల్ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నందున మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నెక్కొండ, మార్చి 4 : నెక్కొండకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి రావుల అరవింద్‌రెడ్డి(21) హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలిసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం నెక్కొండలో అరవింద్‌రెడ్డి మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మంచి భవిష్యత్తు ఉన్న అరవింద్‌రెడ్డి మృతి తీర్చలేని లోటంటూ తల్లిదండ్రులు మధుకర్‌రెడ్డి-రజిత, పెద్దనాన్న రావుల హరీష్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పరామర్శించారు.

ఎస్సైని కలిసిన నాయకులు

చెన్నారావుపేట, మార్చి 4: మండలంలో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గూడ అరుణ్‌కుమార్‌ను సోమవారం గొర్రెల పెంపకందారుల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించారు, కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధుకర్, మండల కార్యదర్శి జక్క రవి, మండల ఉపాధ్యక్షుడు కుమారస్వామి, టి.కుమార్, రవికుమార్, ఎంపీటీసీ లక్ష్మీరాజన్న, గోపాల మిత్రులు పాల్గొన్నారు.